క్లుప్తంగా

జీడీసీఎంఎస్ డైరెక్టర్‌గా విజయభాస్కరరెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) పాలకవర్గ సభ్యుడిగా మాచర్ల మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల విజయభాస్కరరెడ్డి ఇటీవల నియమితులై బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా నియమితులైన విజయభాస్కరరెడ్డి మంగళవారం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మిని గుంటూరు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా పాలకవర్గ సభ్యులుగా నియమితులైన విజయభాస్కరరెడ్డిను మిగిలిన పాలకవర్గ సభ్యులకు పరిచయం చేశారు. ఇదే క్రమంలో గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గ సభ్యుడిగా సేవలందించిన మద్దిరాల కృష్ణారెడ్డిని పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కళాకారులకు తోడ్పాటు



నెహ్రూ నగర్: పెయింటింగ్ కళాకారులకు నగర పాలక సంస్థ తరఫున తగిన తోడ్పాటు నందించడానికి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. మంగళవారం ది పెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నగర పాలక సంస్థ చేపట్టే పెయింటింగ్ పనులను తమకు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులలో భాగంగా చేపడుతున్న పెయింటింగ్ పనులను దిపెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీవనోపాధికై తమకు కేటాయించాలని కోరారని, సదరు పెయింటింగ్ పనులు వారికి కేటాయించడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు రాపర్ల వినోద్ చౌదరి, చెన్నం కళ్యాణ శ్రీనివాసరావు, అధ్యక్షుడు వీళ్ళ దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వరికుంట రాజేష్, కోశాధికారి బోల్లవరపు రామ కోటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు గాజుల శివశంకర రావు, సహాయ కారదర్శి కర్రా హేబ్సి బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు



తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం రూ.70 లక్షలను వెచ్చించనున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆ ప్రదేశాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా పట్టణ, పరిసరాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తం సమకూర్చేందుకు రెడ్‌క్రాస్ రక్తనిధిని ఏర్పాటు చేయనున్నట్టు చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ వెల్లడించారు. రక్తనిధి ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు తోడ్పడవచ్చని చెప్పారు. రక్తనిధి ఏర్పాటుకు తమ సమావేశంలో తీర్మానించిన విషయాన్ని తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పందించారని రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి చెప్పారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఒక గదిని ఇందుకు నిర్ణయించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారని చెబుతూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. వీరితో మున్సిపల్ ఏఈ ఫణీంద్ర, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులకు ఇబ్బంది లేకుండా చర్యలు



తాడికొండ: సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అన్నారు. తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీని మంగళవారం జీడీసీసీ బ్యాంకు చైర్మన్ పరిశీలించారు. బ్యాంకు భవనాలను పరిశీలించిన అనంతరం ఎరువుల గోదాములో నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. అమరావతి మండలం మునగోడు, తాడికొండ, నూతక్కి సహకార సొసైటీలలో రైతులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. గతేడాది సుమారు రూ.70 లక్షల విలువైన ఎరువులను రైతులకు అందించినట్లు సీఈఓ సుజనీ తెలిపారు. కోరమండల్ కంపెనీ వారి సహకారంతో నేరుగా ఎరువులు సరఫరాకు మెంబర్‌షిప్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందిన అర్జీదారులతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టినట్లు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలో 14వ సచివాలయం పరిధిలోని 24, 25 వార్డుల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని, మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలను అందని వారిని గుర్తించి, వారికి కూడా పథకాలు అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు ఉచితగా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు వివరించారు. అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహ్మద్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, అల్లా బాషా, అమరినేని సాంబశివరావు, కొల్లేరు శ్రీనివాసరావు, గేరా సంజీవ్, మోపర్తి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

పెదనందిపాడు: ప్రజా సమస్యలను పరిష్కరించటానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినదని డీడీఎల్‌వో టి.సుజాత అన్నారు. మంగళవారం గోరిజవోలుగుంటపాలెం, రావిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీడీఎల్‌వో మాట్లాడుతూ.. పరిష్కారం కానీ సమస్యలకు దరఖాస్తు వెంటనే పరిష్కరించునున్నట్లు ఆమె తెలిపారు. గోరిజవోలుగుంటపాలెంలో 703 సర్టిఫికెట్స్, రావిపాడులో 593 ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దారు సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్, ఏఓ సుధారాణి, ఈఓపీఆర్డీ సాయిలీల, సర్పంచ్‌లు ఎం.శ్రీదేవి, వి.కోటిరెడ్డి, సచివాలయల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గార్లపాడు(కాకుమాను): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గార్లపాడు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల లబ్ధికి అవసరమైన ధ్రువపత్రాలను ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, రూపాయి ఖర్చు కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ పాల్గొన్నారు. 567 మందికి పలు ధ్రువపత్రాలు అందజేశారు. పెద్దివారిపాలెం సర్పంచ్ నిర్మల, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

గుంటూరు రూరల్: మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, పక్కనే ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు మితిమీరిన వేగంతో ఓబులునాయుడుపాలెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేట మండలం పసుమర్తి గ్రామానికి చెందిన మర్రి సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై నడుస్తున్న మరో వ్యక్తినీ కారు ఢీకొంది. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కారు వేగాన్ని గమనించిన ఓ బాలిక, వృద్ధులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అప్పటికీ ఆగని కారు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీరు లేకపోటంతో ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి, గాయపడిన సుబ్బారావును చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. కారును, అందులోని డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంపై నల్లపాడు పోలీసులు ఫిర్యాదు అందలేదని తెలిపారు.



కాల్వలోకి దూసుకెళ్లిన కారు

నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

గుంటూరు రూరల్: ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన కొంత మంది ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోలీసుస్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందించి, ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా చూడాలని ఆయన ఆదేశించారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేయాలని చెప్పారు. స్టేషన్ లో నమోదైన వివిధ కేసుల వివరాలను నల్లపాడు సీఐని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్స్ కదలికలు, గంజాయి రవాణా, విక్రేతలపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సిబ్బంది సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుభాష్, సీఐలు శ్రీనివాసరావు, నరసింహరావు, ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



స్టేషన్‌లో మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్

నలుగురు జూదరుల అరెస్ట్

పెదనందిపాడు : నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని గోగులమూడి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,250లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు

కొరిటిపాడు(గుంటూరు): నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని టి.జె.పి.ఎస్. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం పేర్కొన్నారు. స్థానిక కళాశాల కెరీర్ గైడెన్స్ – ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారంమెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కూడా కష్టపడే స్వభావాన్ని అలవరచుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రోజు జరిగే మార్పులను అంచనా వేసుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొన్నాయి. 280 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొంటే 250 మంది జాబ్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు.

30న రైతు సమస్యలపై రాష్ట్ర సదస్సు

పాత గుంటూరు: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను దెబ్బతీసే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, పచ్చల శివాజీ అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 30న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఢిల్లీ రైతు ఉద్యమాన్ని నడిపిన జాతీయ నాయకులు పాల్గొని మరో ఢిల్లీ రైతు పోరాటం రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ పాల్గొనాలని తెలిపారు. ఏఐకేఎంఎస్ నాయకులు గనిరాజు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తొలగించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం కాకుమాను, చేబ్రోలు, పొన్నూరు మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గణిత పాఠ్యాంశం సులభరీతిలో బోధించే అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రస్తుత విద్యార్థులు గణితశాస్త్రం అంటే భయపడుతున్నారని, వారికి సులభతరంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ఎంఈఓ–2 విజయ భాస్కర్ మాట్లాడుతూ అన్ని పాఠ్యాంశాల కన్నా.. గణితశాస్త్రం చాలా సులభంగా ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి బాధ్యత

నగర కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ చేకూరి కీర్తి కోరారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్ఓ, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ నమోదు ఆశించిన స్థాయిలో లేదని, వార్డ్ సచివాలయాల వారీగా ప్రతి కార్యదర్శి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తూ వారిని కూడా భాగస్వాములను చేస్తూ ఫీడ్ బ్యాక్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యదర్శులు ఫీడ్ బ్యాక్ నమోదులో పూర్తిస్థాయి విధుల్లో ఉండేలా నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫీడ్ బ్యాక్‌పై రోజువారీ నివేదిక ఇవ్వాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. నగర ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాలను తెలియచేయాలన్నారు. ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే ఓటీపీ అని ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. అదనపు కమిషనర్ పెద్దిరోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, రవీంద్ర, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చేకూరి కీర్తి

ప్రణాళిక బద్ధంగా డోర్ టూ డోర్ సర్వే ..

నెహ్రూనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేను బీఎల్ఓలు ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత ఎన్నికల సంఘం సూచనల మేరకు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నగరంలో జరుగుతున్న డోర్ టూ డోర్ ఓటర్ సర్వేపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్ఓలు ఓటర్ సర్వే పక్కాగా జరగాలని, ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. సర్వే విధుల్లో ఎక్కడా వలంటీర్లను ఇన్వాల్వ్ చేయవద్దని స్పష్టం చేశారు. బీఎల్ఓలు నగరపాలక సంస్థ నుంచి అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలన్నారు. డోర్ నంబర్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నూతన ఓటర్లను చేర్చాలని, నూతన డోర్‌నంబర్లపై ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నగర ప్రజలు కూడా తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బీఎల్ఓలకు తగిన సమాచారం అందించి సహకరించాలని, ఎన్నికల సంఘం నెల రోజులపాటు ఓటర్ల లిస్టులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేని ఓటర్ల లిస్టు తయారికి స్పెషల్ క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.

గ్రామ విత్తన పథకంపై రైతులకు అవగాహన



రైతు శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న రామాంజనేయులు

గుంటూరు రూరల్: గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తి జరిగితే అది రైతులకు ఎంతో లాభదాయకమని డీఆర్‌సీ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ పి.రామాంజనేయులు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం సొపాడు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యసాయశాఖ అధికారణి లక్ష్మి గ్రామీణ విత్తన పథకంపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో రైతులు విత్తనోత్పత్తి చేసుకునేందుకు వీలుగా దశల వారిగా మూడు సార్లు రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, నాణ్యమైన విత్తన సేకరణ గురించి వివరించారు. వీఏఏలు షేక్ షాహీద్, ఎం.రాజవంశి, రైతులు పాల్గొన్నారు.

నైఫర్–23 ఫలితాల్లో 'చలపతి ఫార్మసీ' విద్యార్థుల ప్రతిభ



పి.ప్రవీణ్



ఎం.సోను



షేక్ సాజిద్



కె.శశిధర్



బి.సాయి హనుమంతు హరీష్

గుంటూరు రూరల్: జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో ఫార్మసీ విద్యా పరిశోధనలు అందిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్(ఎన్ఐఎఫ్ఈఆర్) పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం లాం నందున్న కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది జూలై 13న 'నైఫర్' పరీక్ష జరిగిందని ఆయన తెలిపారు. ఈ పరీక్ష రాయాలంటే జీప్యాట్ అర్హత పొంది ఉండాలని చెప్పారు. కళాశాల విద్యార్థి పి.ప్రవీణ్ జాతీయ స్థాయిలో 94వ ర్యాంకును జీ ప్యాట్‌లో సాధించి, నైఫర్‌కు క్వాలిఫై అయ్యాడని తెలిపారు. నైఫర్ పరీక్షల్లో 1,524వ ర్యాంకును సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు ఎం.సోను 2,408, షేక్ సాజిద్ 2,557, కె.శశిధర్ 2,885, బి.సాయి హనుమంతు హరీష్ 2,953వ ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారిని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన కిషోర్

గుంటూరు రూరల్: ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి.కిషోర్ చౌదరికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది ఫిజికల్ మెకానికల్ అండ్ థర్మల్ ప్రాపర్టీస్ ఆఫ్ అరేకా ఫైబర్ అండ్ కోకో నట్ షెల్ పౌడర్ రీన్ఫోర్స్డ్ ఎపోక్సి కాంపోజిట్' అనే అంశంపై డాక్టర్ డీవీవీ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఐదుకు మించి అంతర పంటలు ఉండాలి

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో రైతులు ఐదుకు మించి అంతర పంటలు వేసే విధంగా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.వెంకటరావు తెలిపారు. నగరంలోని డీపీఎం కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు తమ పరిధిలోని సొంత పొలాల్లో ఖచ్చితంగా ఐదుకు మించి అంతర పంటలు ఉండేలా ఏ గ్రేడ్ మోడల్ ప్లాట్లుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.రాజకుమారి మాట్లాడుతూ మిరప రైతుల పొలాల్లో పీఎండీఎస్ పూర్తి చేయాలని చెప్పారు. అంతర పంటలకి అవసరమైన ఉల్లి, బంతి నారు, ఇతర విత్తనాల కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులతో బ్లాక్స్‌లో నిర్దేశించిన విధంగా పంటలు వేయించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను చైతన్యపరచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎం జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజినల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.వెంకటరావు

మణిపూర్ నిందితులను శిక్షించాలి

కర్లపాలెం: మణిపూర్ మారణకాండకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం కర్లపాలెం సెంటర్‌లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దోషులను వెంటనే అరెస్టు చేసి, శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.



విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మంగళగిరి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు మరిన్ని రంగాల్లో రాణించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు నిర్మలా సీబీఎస్ఈ స్కూల్, ఫార్మసీ కళాశాల విద్యార్థులతో మంగళవారం మమేకమయ్యారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చన్నారు. విద్యార్థులతో కలసి క్రికెట్ ఆడి వారి పలు అంశాలు వివరించారు. అనంతరం ఆత్మకూరు పంచాయతీని సందర్శించి మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి రైస్ మిల్లులో తేనేటి విందును స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సేవాభావంతో పని చేస్తున్నారన్నారు. చేనేత పరిశ్రమను పరిశీలించడం జరిగిందని, ప్రభుత్వం వారికి అన్ని రకాలా సహాయం అందిస్తుందని, మరింత సహాయం అందేలా భవిష్యత్తులో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. అనంతరం నూతక్కిలో పలు పంటలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీలకు అధికారులు జరిమానా విధించారు. తెనాలి మండలం కొలకలూరు వద్ద నందివెలుగు–గుంటూరు రహదారిపై అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం. సిబ్బంది మంగళవారం గుర్తించారు. జరిమానా విధించారు.